విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

నేడు నర్సింగ్ కాలేజ్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : మచిలీపట్నం అభివృద్ధిలో భాగంగా ఈనెల 5వ తేదీ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కెమికల్స్ & ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవియా పర్చువల్‌గా నర్సింగ్ కాలేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని, దీని కొరకు మచిలీపట్నం మెడికల్ కళాశాల లెక్చర్ గ్యాలరీ-1లో విజువల్ ఏర్పాట్లు చేసామని, జిల్లా సమాచార పౌర సంబంధాధికారి కోరారు.

ఉద్యమాల గడ్డ... గుడివాడ!

- తొలుత కమ్యూనిస్టుల అడ్డా
- టిడిపి ఆవిర్భావం తరువాత పసుపు అడ్డాగా...
- రెండుసార్లు వైసిపి విజయం సాధించింది.

విశాలాంధ్ర-గుడివాడ : ఉద్యమాలకు నెలవుగా, పేదప్రజల పోరాటాలకు గడ్డగా గుడివాడ నిలుస్తుంది. అసైన్డ్ భూముల ఆక్రమణలు, ఇళ్ళ స్థలాల కోసం పేదల పాట్లు, చేపల చెరువుల వలన ఎదుర్కొంటున్న సమస్యలను నుండి విముక్తి కల్పించాలని పోరాటాలు చేస్తున్నారు. నియోజకవర్గ తొలినాళ్ళలో కమ్యూనిస్టులకు అడ్డాగా ఉన్న గుడివాడ తదనంతరం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది.

భౌగోళిక స్వరూపం...

గుడివాడ నియోజకవర్గం 40,256 హెక్టార్లలో విస్తరించి ఉంది. తూర్పున కైకలూరు, పడమర పామర్రు, ఉత్తరం గన్నవరం, దక్షిణం పామర్రు నియోజకవర్గాలున్నాయి. రాష్ట్ర రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో, సిఆర్‌డిఎ పరిధిలో నియోజకవర్గముంది. నియోజకవర్గంలో 2,90,207 జనాభా ఉండగా 75,498 కుటుంబాలున్నాయి. 2,13,371 మంది ఓటర్లు, 230 పోలింగ్ బూత్‌లున్నాయి. వీరిలో పురుషులు 96,580, స్త్రీలు 1,04,781, మంది ఉన్నారు. జండర్స్ 10మంది ఉన్నారు.

రాజకీయ నేపథ్యం....

గుడివాడ నియోజకవర్గ ఆవిర్భావం 1952లో జరిగింది. నాటి నుండి నేటి వరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో గుడివాడ స్వరూపం మారింది. నియోజకవర్గ పరిధిలో గతంలో పెదపారుపూడి, పామర్రు మండలాలుండగా పునర్విభజన తరువాత గుడ్లవల్లేరు, నందివాడ మండలాలు చేరాయి. 1952 గంజి రామారావు (కమ్యూనిస్టు), 1955 ఉప ఎన్నికల్లో ఎ.వి సుబ్రహ్మణ్యం(స్వతంత్ర), 1962లో గంజి రామారావు(కమ్యూనిస్టు), 1967లో ముసునూరి కస్తూరిదేవి(కాంగ్రెస్), 1969లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా పోటీ చేసి ఎ.వి సుబ్రహ్మణ్యం గెలుపొందారు. అనంతరం 1972, 1978 శాసనసభ ఎన్నికల్లో కఠారి సత్యనారాయణరావు(కాంగ్రెస్), 1983, 1985 ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, 1985, 1994 ఉప ఎన్నికల్లో రావి శోభనాద్రి చౌదరి, 1989తో కఠారి ఈశ్వర్‌కుమార్ (కాంగ్రెస్), 1999లో రావి హరిగోపాల్, 2000లో జరిగిన ఉప ఎన్నికల్లో రావి వెంకటేశ్వరరావు, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తెలుగుదేశం తరుపున 2సార్లు, వైసిపి పార్టీ తరపున 2సార్లు పోటీ చేసి గెలుపొందారు.

నియోజకవర్గ విశిష్టత...

గుడివాడ నియోజకవర్గం వరి పంటకు, చేపల సాగుకు పేరుగాంచింది. గుడివాడ పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి సాధించింది. ఎక్కువగా ఇక్కడి ప్రజలు చేతివృత్తులు, కూలీ పనులపై ఆధారపడి జీవిస్తుంటారు. దేవాలయాలకు ప్రసిద్ధి గాంచింది కాబట్టి గుడులవాడ కాస్తా గుడివాడగా మారింది. నందివాడ మండలం దేశంలోనే తలసరి ఆదాయంలో రెండో స్థానంలో నిలిచింది. చేపల సాగు నందివాడ మండలంలో ఎక్కువ జరుగుతుంది.

ప్రధాన పార్టీల నడుమ పోటీ...

టిడిపి ఆవిర్భావానికి ముందు దాకా కాంగ్రెస్ నియోజకవర్గంలో పాగా వేయగా తరువాత జరిగిన 11 ఎన్నికల్లో ఒక పర్యాయం కాంగ్రెస్, రెండు పర్యాయం వైఎస్ఆర్‌సిపి అభ్యర్థులు విజయం సాధించాయి. 2024 ఎన్నికల్లో ప్రధానంగా పోటీ టిడిపి, వైకాపాల మధ్య నెలకొంది. టిడిపి నుండి వెనిగండ్ల రాము, వైఎస్ఆర్‌సిపి ఇప్పటికే 6 లిస్టులు ప్రకటించినప్పటికి గుడివాడ నుండి ఇంక పేరు ప్రకటించలేదు, అయితే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) తప్ప వేరే ఎవరు వైసిపి లీడర్ లేకపోవడం గమనర్హం, కాంగ్రెస్ పార్టీ కూడ వైయస్ షర్మిల రాష్ట్ర అధ్యక్షురాలు అయిన నాటినుండి కాంగ్రెస్ పార్టీ నుండి కూడ పోటి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బిజెపి ఏ పార్టీకి మద్దతు ఇస్తుందో తెలియాలి, జనసేన ఇప్పటికే టిడిపి విజయం కోసం పనిచేస్తుంది.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ...

ప్రభుత్వ కాలేజీలో కొనసాగుతున్న కోచింగు సెంటర్

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామీణ ప్రాంతంలో నాలుగు దశాబ్దాల క్రిత ం నెలకొల్పిన మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల వచ్చే నెలలో నిర్వహించే పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధన కోసం అడుగులు వేస్తోందని నిర్వాహకులు తెలిపారు. 1982వ సంవత్సరంలో స్థాపించిన ఈ కళాశాల కొంతకాలం సాధారణ స్థాయిలో పరీక్ష ఫలితాలు కొనసాగినా అనంతరం 1995 సంవత్సర ప్రాంతాల్లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన వేదాంతం గోపాలచార్యులుహయాంలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. డిసెంబర్ 15వ తేదీన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కేఏవిఎస్‌వి ప్రసాద్ శాస్త్రి అధ్యాపకుల సహకారాలతో కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధన కోసం నడుంబిగించారు. దీనిలో భాగంగానే రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ చదువుతున్న 527 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం కోసం ఇంటెన్సివ్ కోచింగ్ నిర్వహిస్తున్నారు. కళాశాల ఆవరణలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రతి విద్యార్థి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాల పేరు ప్రతిష్టలు పెంపొందింప చేయడానికి కృషి చేస్తున్నారు. జనరల్ కోర్సు, వృత్తి విద్య కోర్సుల అధ్యాపకుల పరీక్షలలో సబ్జెక్టు వారీగా ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది.

ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ప్రిన్సిపాల్ ప్రసాదశాస్త్రి

ఇంటర్ బోర్డు నుంచి బదిలీపై డిసెంబర్ 15న బాధ్యతలు చేపట్టాను. అంతకుముందు కళాశాలలో ప్రధాన ఆచార్యులుగా పనిచేసిన అనుభవంతో విద్యారంగంలో ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చంపుతున్నాను. కళాశాల ఫలితాల రికార్డు పరిశీలించి గతంలో పనిచేసిన ప్రధానాచార్యుల బాటలో కళాశాల నడిపి జిల్లా రాష్ట్రస్థాయిలో ఫలితాలు సాధించడానికి సహచర అధ్యాపకుల సహకారంతో బాటలు వేస్తున్నాను.

కొండలమ్మను దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి అరుణ సారిక దర్శించుకొని, తమ మొక్కుబడులను తీర్చుకొని యున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరు సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ ఆలయ మర్యాదలతో అరుణ సారికకు స్వాగతం పలికి అమ్మవారి యొక్క చిత్రపటము, శేష వస్త్రము మరియు తీర్థ ప్రసాదము న్యాయమూర్తికి అందించారు.

మరో అవకాశం ఇవ్వండి : ఉప్పాల రాము

విశాలాంధ్ర-పెడన : వైయస్ జగన్మోహన్ రెడ్డి కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరొక అవకాశం కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇంచార్జ్, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము విజ్ఞప్తి చేశారు. పెడన మండలం నడుపూరు గ్రామపంచాయతీలో ఆదివారం ఉప్పాల రాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నడుపూరు గ్రామంలోని గ్రామ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద మధ్యతరగతి సామాన్య వర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జన రంజక పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, పెడన మండల ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి. అచ్యుతరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి రామానాయుడు, వైస్ ఎంపీపీలు యాదం రెడ్డి వరప్రసాద్, పరసవాకాలమ్మ, వైసిపి మున్సిపల్ కౌన్సిల్ పక్ష నాయకులు బళ్ల గంగయ్య, పెడన పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు మతిన్ ఖాన్, బెజవాడ నాగబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మెట్ల గోపి, వైయస్ఆర్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, ఎంపీటీసీలు అంకెం గిరిబాబు, బొల్లా ఉదయ్ కుమార్, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ రజతోత్సవ సభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభలు ఈ నెల 10, 11 తేదీలలో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య క్యాంపస్ సెమినార్ హాలు-2లో డిటిఎఫ్ రజితోత్సవ సభలు 25 ఏళ్ళు నిండిన సందర్భంగా జరుగుతున్నందున ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ళ వరుణ కుమార్ ఆదివారం ఆ సంఘ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే నరహరి, ఎస్ వి రమణయ్య, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి కృష్ణయ్య,లు పాల్గొంటారని ఆయన అన్నారు. మొదటి రోజు విద్యారంగ సమస్య, విద్యార్థి ఉపాధ్యాయ జెమిని ఉద్యమాల అవశ్యకత అనే అంశంపై ప్రొఫెసర్ జి హరి గోపాల్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, మాతృభాష మాధ్యమం హార్దిక స్థితిగతులు అనే అంశంపై ప్రొఫెసర్ గార్లపాటి ఉమామహేశ్వరరావు నియత విద్య, సహజ విద్య అనే అంశంపై డి చంద్రశేఖర్ టీచర్ బౌద్ధ రచయిత ప్రసంగిస్తారని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కె రాజేంద్రప్రసాద్, కే సాల్మన్ రాజులు ఈ విషయమై అవగాహన కల్పిస్తారని రావెళ్ల ఒక ప్రకటనలో వివరించారు.

నేడు శ్రీ చలువ గంగానమ్మ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండలం లోని చోరగుడి శివారు గోపాలకృష్ణాపురంలో శ్రీచలవ గంగానమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టా కార్యక్రమం సోమవారం యంపిటిసి మద్రి దుర్గారావు దంపతులు చే జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సదరు గ్రామానికి చెందిన ఇరవై ఐదు కుటుంబాల వారికి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చేతులు మీదుగా ఐదు ఎకరాల భూమి పట్టాలు పంపిణీ జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి పల్లెబాట పల్లెనిద్ర

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు, ప్రజలు పడుతున్న సమస్యలు తెలుసుకోవడానికి, "పల్లె బాట- పల్లెనిద్ర" కార్యక్రమం సోమవారం ఉదయం గం 9:30 ని"లకు పామర్రు నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా అధ్వర్యంలో ప్రారంభమవుతున్నందున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు.

తుమ్మలపల్లిలో సచివాలయ భవనాలు ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు విద్యా, వైద్యం సంపూర్ణంగా అందించాలనే సంకల్పంతో సిఎం జగన్ తీసుకున్న చర్యలు ఎంతో విజయవంతమయ్యాయన్నారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నిబద్ధత కలిగిన నాయకుడు జగన్ అన్నారు. డ్రాకులా మాదిరి ప్రజల రక్తం పీల్చేందుకు, సైకిలెక్కి గ్లాసు పట్టుకొని మన ముందుకు వచ్చే చంద్రముఖిలకు గుణపాటం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, సర్పంచ్ రాధాకృష్ణ, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, తుమ్మలపల్లి ఎంపిటీసీ వెన్నా ప్రభావతి, నాయకులు కొండపల్లి కుమార్‌రెడ్డి, చింతాడ నాగూర్, పాలేటి చంటి, గూడపాటి వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ,కందుల నాగరాజు, అమృతబాబు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అందరూ భాగస్వామ్యం కావాలని గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖరరావు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ నిర్మూ లనా దినోత్సంగా సందర్భంగా ఆదివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం మరియు ప్రాధాన వీధులలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి కొత్త ప్రపంచం మనం చూడాలంటే నేడు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో నివసించే వ్యక్తుల అలవాట్లను బట్టి తమ ఆరోగ్యం సంపూర్నంగా ఉంటుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు, వాకర్స్ అసోసియేషన్ స్థాపిత నాయకులు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సర్వైకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ అవగాహన లేకపోవడం వల్ల అవి ఎన్నో జీవితాలకు శాపంగా మారుతున్నాయి. తొలినాళ్లలో గుర్తించలేకపోవడంతో ఏటా ఎంతోమంది మహిళలు వీటి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కల్పించటంతో పాటు వ్యాధి సోకిన వారికి వైద్యానికి అవసరమైన అర్థిక సహాయం చేయాలని దాని బాధితురాల భర్త,రాజకీయ వ్యూహకర్త తాతా సుబ్రహ్మణ్యం కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ మహిళలకు ఎక్కువగా సోకే క్యాన్సర్లలో నాలుగోది.మన దేశంలోనూ దీని ప్రభావం ఎక్కువే ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే కేసుల్లో నాలుగో వంతు, మరణాల్లో మూడో వంతు మన దేశం నుంచే నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.ఇటీవల తన భార్యకు కూడా క్యాన్సర్ సోకింది ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు రూ 50 వేలు మెడికల్ టెస్టుకు తీసుకున్నారు.సర్వైకల్ క్యాన్సర్ గనుక వస్తే చాలా ప్రమాదకరం చాలా జాగ్రత్తగా ఉండాలని ,క్యాన్సర్ సర్వేకల్ జబ్బులు చాలా ఖరీదైనదని పేద మహిళలు సామాన్య మహిళలు ఇలాంటి ఖరీదైన జబ్బులు వస్తే ఆర్థికంగా మానసికంగా చాలా కృంగిపోతారు మగవారికన్నా ఆడవారిలోనే ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని వారు ఇలాంటి బారిన పడకుండా ఉండాలన్నారు. క్యాన్సర్ గురించి ముందుగానే అవగాహన తెలుసుకోవడం ప్రజలందరి బాధ్యత, పేద మహిళలకు సామాన్య మహిళలకు క్యాన్సర్ టెస్టులు ప్రభుత్వం ఉచితంగా చెయ్యాలనీ కోరారు.

స్నేహశీలి, గాయకుడు డేవిడ్‌కు సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : జెఎస్ఎస్ సరాగాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయం హాలులో జరిగిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో గాయకుడు డేవిడ్ రాజుకు ఘన సత్కారం జరిగింది. ఝాన్సీ నేతృత్వంలో అతిథులుగా బివి వీరభద్రరావు, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతకాయల చిట్టిబాబు, బాజీ, నాగభూషణం, బండారు నరసింహారావు, ప్రసూన రామన్, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి తదితరులు ఆయనను గజమాలతో సత్కరించి, గౌరవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహశీలి, మృదుభాషి, సాంస్కృతిక, సామాజిక, సాంఘిక సేవాతత్పరుడు, గంభీర కంఠస్వరం కలిగిన గాయకుడు డేవిడ్ రాజును సత్కరించుకోవటం ఎంతో సముచితమన్నారు. అనంతరం సినీ సంగీత విభావరి శ్రవణానందకరంగా జరిగింది.

సద్గురువు త్యాగరాజుకు సంగీత స్వర నీరాజనాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో ఆదివారం ఉదయం నగరంలోని సంగీత విద్వాంసులు, విద్యార్థులు, వర్ధమాన కళాకారులు త్యాగరాజ స్వామి వారి ఘన రాగ పంచరత్న కీర్తనలతో త్యాగబ్రహ్మకు సంగీత స్వర నీరాజనాలర్పించారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలోని కళావేదికపై నాదయోగి త్యాగయ్య ఆరాధనోత్సవాలు జరుగుతున్నాయి. ఏడు రోజులు పాటు జరిగిన ఉత్సవాలలో ఏడవ రోజు ఆదివారం ఉదయం శ్రీ గణపతిని సేవింపరారే అనే కృతి తో గణపతిని ప్రార్థిస్తూ ప్రారంభించగా వరుసగా నాటరాగంలో జగదానందకారక, గౌళ రాగంలో దుడుకు గల, ఆరభి రాగంలో సాధించెనే ఓ మనసా, వరాళి రాగంలో కన కన రుచిరా, శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు పంచరత్న కీర్తనలను శృతిలయలను మేళవిస్తూ గానం చేసి పాడి, వయోలిన్, వీణ, వేణువులతో వాయించి వినిపించారు. కార్యక్రమాలను ప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, విఖ్యాత మృదంగ విద్వాంసుడు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ తదితరులు ఏడు రోజుల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు.

టీడీపీలోకి వైసీపీ మైనార్టీ, బీసీ నాయకులు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము సమక్షంలో ఆదివారం స్థానిక 17వ వార్డుకు చెందిన పలువురు మైనార్టీ, బిసి సంఘాలకు చెందిన నాయకులు. స్థానిక బైపాసు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో 17వ వార్డు వైసిపి, మైనార్టీ, బీసీ సంఘాల నేతలకు టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో మద్దతు తెలుపుతున్న ప్రజానీక నమ్మకాన్ని వమ్ముకానీయకుండా పనిచేస్తానన్నారు. 20 ఏళ్లుగా అన్ని రంగాల్లో గుడివాడ వెనుకబడిన ఉందన్నారు. అభివృద్ధి అంటే ఏంటో రాబోవు ఐదేళ్లలో చూపిస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కాల్యాణ్ కూటమికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, బత్తిన బాద్రచలం, శౌంఠి అయ్యప్ప, మద్దుకూరు ప్రభాకర్, ఉస్మాన్, తదితరలు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించే ద పవర్ ఆఫ్ గుడ్ విషెస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి తనకు సంబంధం లేని వ్యక్తులు ప్రేమతో మీరు బాగుండాలి అని చెబితే వారు పొందే ఆనందం అంతా ఇంతా కాదు... ఆ మాటలు... అనారోగ్యాంతో ఉన్న వ్యక్తికి మనోధైర్యాన్ని నింపి అతనికున్న వ్యాధి త్వరగా నయం అయ్యేటట్టు చేస్తుంది... ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని వాళ్ళు క్యాన్సర్ తో బాధపడుతున్న వారి కోసం విజయవాడ బందర్ రోడ్ లోని పి.వి.పి మాల్‌లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఇస్మార్ట్ స్వీటీ, అన్య....మాల్ వచ్చిన వారిదెగ్గర నుండి గుడ్ విషెస్ తీసుకొని ఎఫ్ఎం రేడియోలో ప్లే చేశారు. ఈ కార్యక్రమం క్యాన్సర్ తో బాధపడుతున్న వారికి మనోధైర్యం ఇస్తుందని మరియు క్యాన్సర్ పై అవగాహన పెంచుతుందని డాక్టర్ వి.ఎస్. యస్.రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ,ముఖ్య, అతిథులుగా గోపీచంద్, విజయవాడ జోనల్ హెడ్ నార్త్ కర్ణాటక అండ్ ఆంధ్ర ప్రదేశ్ కె.రవి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ భాష పర్యవేక్షించారు.

సందేశాత్మకంగా హాస్య నాటికల ప్రదర్శనలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ముమ్మనేని సిద్ధార్థ కళా పీఠం సౌజన్యంతో నాలుగు రోజులు పాటు సిద్ధార్థ ఆడిటోరియంలో సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 26వ తెలుగు హాస్య నాటికల ప్రదర్శనలు, సుమధుర స్వర్ణోత్సవ వేడుకలలో నాలుగువరోజు ఆదివారం నాటి ప్రదర్శనలు సమకాలీన సమస్యలతో హాస్యాన్ని పండిస్తూ ప్రదర్శితమయ్యాయి. ఆదివారం నాటి ప్రదర్శనలలో ప్రథమ ప్రదర్శనగా శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల (విజయవాడ)సమర్పణలో ఎం ఎస్ నారాయణబాబు రచించగా వాసు దర్శకత్వం వహించిన ఇంకానా నాటిక, ద్వితీయ ప్రదర్శనగా బి స్టూడియో (హైదరాబాద్) సమర్పణలో ప్రత్యేక ప్రదర్శనగా మహమ్మద్ ఖదీర్ బాబు రచించిన జాన్ బషీర్ దర్శకత్వం వహించిన న్యూ బాంబే టైలర్స్ నాటికలు ప్రదర్శితమయ్యాయి.

బుర్రా సాయి మాధవ్ కు జంధ్యాల స్మారక పురస్కారం.....

అదే వేదికపై సుమధుర స్వర్ణోత్సవ సభలో రచయిత, నటుడు, దర్శకుడు, నిర్మాత, ప్రయోక్త జంధ్యాల స్మారక పురస్కారాన్ని ప్రఖ్యాత సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ కు ప్రదానం చేశారు. సభాధ్యక్షులుగా సుమధుర అధ్యక్షులు సామంతపూడి నరసరాజు వ్యవహరించగా సుమధుర పరిషత్తు చైర్మన్ డాక్టర్ ఎన్ మురళీకృష్ణ అతిథులను స్వాగతించారు. గౌరవ అతిథులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్, సిద్ధార్థ కళాపీఠం జనరల్ సెక్రెటరీ ఎస్ లలిత ప్రసాద్, ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ పూర్ణచంద్, డాక్టర్ కొడాలి జగన్ మోహనరావు, ప్రముఖ రంగస్థల, సినీ నటులు కేదార శంకర్, హైకోర్టు న్యాయవాది ధారా సత్యనారాయణ, కళామందిర్ చైర్మన్ చలువాది ప్రసాద్, రంగస్థల నటులు, దర్శకులు దొంతిరెడ్డి వేమారెడ్డి తదితర ప్రముఖులు, విద్యావేత్తలు వ్యాపారవేత్తలు, కళాభిమానులు పాల్గొని ఆహుతుల హర్షధ్వానాల మధ్య సాయి మాధవ్ కు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-నందిగామ: కరువు, మిచాంగ్ తుఫాన్ వల్లతుఫానుతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్నిడి యలమందరావు, చుండూరు సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు పేట సిఆర్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం కరువు తుఫాన్లతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు కౌలు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీన కలెక్టర్, ఆర్‌డిఓ, కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు వినతి పత్రాలు ఇవ్వాలని వారు తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల 45 వేల రూపాయల అప్పుల భారం ఉందని, కనీసం రెండు లక్షల వరకు పంట రుణాలు రద్దు చేయాలని తెలంగాణ తరహాలో ఎకరాకు 15 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించాలని ఈనెల 8వ తేదీన జరగబోయే ఈ కార్యక్రమానికి రైతులు రైతాంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పొల్లేడి నాగభూషణం, సీపీఐ మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, వేముల వీరయ్య, సీనియర్ నాయకులు బలసపాటి రాంబాబు, పాల్గొన్నారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ : ఆర్డీఓ

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయిబాబు ఆదివారం తనిఖీ చేశారు. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో జగనన్న కాలనీలలో నివేసిన స్థలాలు పొందిన లబ్ధిదారులందరికీ రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రారంభ మైంది. పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ రిజిస్ట్రార్ హోదాఇచ్చి, ప్రస్తుతం కార్యదర్శి, వీఆర్వోలు కలిసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రారంభించి పట్టాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా వేములపల్లి, మొగులూరు గ్రామలను ఆర్‌డీఓ పి.సాయిబాబు నవరత్నాలు పేదలందరికీ ఇళ్లను సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయి ప్రక్రియను ఆదివారం కూడా జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కంచికచర్ల డిప్యూటీ తహసిల్దారు నాగుల్ మీరా ఆర్డీవో వెంట పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

అభివృద్ధి పథంలో సొసైటీ : సామినేని

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గతంలో రూ.45 కోట్ల లావాదేవీలుతో ఉన్న పెనుగంచిప్రోలు సొసైటీ ప్రస్తుతం రూ.85 కోట్ల లావాదేవీలతో అభివృద్ధి పథంలో సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో రైతు సోదరులకు అండగా ముందుకు పోతోందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయాన్ని, ఆదివారం సందర్శించి అభివృద్ధి కార్యకలాపాలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, మాజీ అధ్యక్షుడు నలపునేని వెంకటనారాయణ, జెడ్పీటీసీ ఊట్ల నాగమణి, కొనకంచి సొసైటీ అధ్యక్షులడు కనగాల శ్రీనివాసరరావు, కనకపూడి భాస్కరరావు, ఊట్ల నాగేశ్వరరావు, ఏనుగుల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (తిరువూరు) : వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు తూము కృష్ణయ్య అన్నారు. ఆదివారం తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో తిరువూరు నియోజకవర్గ రైతు సంఘం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతులను, కార్మికులను, వ్యవసాయ కార్మికులను, ప్రజలను తీవ్ర నిరాశపరిచిందన్నారు. ధనికులను మరింత ధనికులుగా చేసి పేదలను పీల్చి పిప్పి చేసి మరింత పేదలుగా మార్చే బడ్జెట్ గా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కోత పెట్టడం అన్యాయమన్నారు. వ్యవసాయ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం మరింత పెంచి కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ రైతులను బలి పశువులుగా మార్చడం తప్ప ఈ బడ్జెట్ లో అన్నదాతలకు చేసిన మేలు ఏమీ లేదని విమర్శించారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ వంటి ప్రతిపాదనలు లేకపోవడం అన్యాయమన్నారు. ఎరువులు సబ్సిడీ తగ్గించడం వలన ఎరువుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు కేటాయింపులు తగ్గించి వేసి వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేశారన్నారు. ఫిబ్రవరి 8న కలెక్టరేట్ ఆర్ డి ఓ కార్యాలయం వద్ద రైతుల ఆందోళనకు అన్ని వర్గాల మద్దతు తెలియజేయాలని కోరారు. పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించాలి, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానంపై ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం తిరువూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.కె నాగుల్ మీరా మాట్లాడుతూ కార్మిక సంక్షేమాన్ని విస్మరించారని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుకు ప్రతిపాదనలు లేవన్నారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అన్యాయం జరిగిందని ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, విభజన చట్టంలోని హామీల అమలకు ప్రతిపాదనలు లేవన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను అందరూ నిరసించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తిరువూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సింహాద్రి వనమాలి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాని,మల్లం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం నమ్మొద్దు

గాంధీ కో-ఆపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ వెంకట్రావ్

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర-విజయవాడ: గాంధీ కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకులో ఎలాంటి అవకతవకలు జరగలేదని బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ తెలిపారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆదివారం బ్యాంకు సీఈఓ శివప్రసాద్‌తో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పాలకవర్గ అనుమతితోనే కొత్త బ్రాంచీల ఏర్పాటుకు సన్నాహాలు చేశామన్నారు. సభ్యుల డిపాజిట్లు సురక్షితంగా ఉన్నాయని, బ్యాంకుపై అసత్య ప్రచారం నమ్మొద్దని కోరారు. 2021 సంవత్సరంలో తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటికి బ్యాంకు నికర లాభం రూ.5కోట్లు ఉండగా, 2022, 2023 సంవత్సరాలలో రూ.12 కోట్లు అయిందన్నారు. పాలకవర్గానికి సెప్టెంబరు 2022లో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లలో ఇద్దరు డైరెక్టర్లు చైర్మన్, సీఈఓ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కో-ఆపరేటీవ్ డిపార్టుమెంటుకి ఫిర్యాదు చేశారన్నారు. వారితో పాటు నలుగురు బ్యాంకు సభ్యులతో అదే ఫిర్యాదు పెట్టించారన్నారు. బ్యాంకు వారి విచారణలో ఒక సభ్యుడు 2020 మే నెలలో మరణించారని, ఇద్దరు సభ్యులు తాము ఫిర్యాదు చేయలేదని లిఖిత పూర్వకంగా తెలియజేశారని చెప్పారు. విశాఖపట్నం న్యూ గాజువాకలో కొత్త బ్రాంచి పెట్టేందుకు నలుగురు సీనియర్ డైరెక్టర్లు పరిశీలించి అక్కడ పెట్టేందుకు ప్రతిపాదించగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. ఈ నూతన శాఖ ఏర్పాటుకు 33 లక్షల ఖర్చు పెట్టేందుకు బోర్డు తీర్మానిస్తే 28 లక్షల రూపాయలు ఖర్చు అయిందన్నారు. పాలక వర్గ సభ్యుల ఆమోదంతో నూజివీడు, హనుమాన్ జంక్షన్ బ్రాంచ్‌లకు భవన నిర్మాణం నిమిత్తం తీర్మానం చేసి స్థలాలు కొనుగోలు చేశామన్నారు. బ్యాంకులో ఎలాంటి అవకతవకలు జరగలేదని, సభ్యుల డిపాజిట్లు సురక్షితంగా ఉన్నాయని వివరించారు.

సర్వ హక్కులతో స్వగృహాలు

విశాలాంధ్ర-వత్సవాయి: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.26 వేల కోట్ల విలువైన భూమిని 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాల నిమిత్తం ప్రభుత్వం పంపిణి చేసింది అని ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు... మండలంలోనిగోపినేనిపాలెం గ్రామం నందు పేదలందరికీ నవరత్నాలలో ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామం నందు అర్హులైన 204 మంది లబ్ది దారులకు ఇళ్ళ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో సంక్షేమం కానీ ఇళ్ల పట్టాలు కానీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అదే జగనన్న పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం, అర్హులైన 31 లక్షల మంది అక్కాచెల్లెళ్లకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు అని అన్నారు. ఆ గ్రామంలో సుందరయ్య కాలనీ నందు నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మంచి చేసే జగనన్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

ఏపీలో ఉజాస్ మెన్‌స్ట్రువల్ హెల్త్ ఎక్స్‌ప్రెస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అద్వైతేషా బిర్లా నేతృత్వంలో, ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ మద్దతుతో ప్రారంభించిన ఒక సంచలనాత్మక కార్యక్రమం, ఉజాస్ మెన్‌స్ట్రువల్ హెల్త్ ఎక్స్‌ప్రెస్, రాష్ట్రంలో పరివర్తనాత్మక కార్యక్రమాలను ప్రారంభించింది. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో చెరగని ముద్ర వేసిన ఈ విశిష్ట కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో ఋతుక్రమ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ద్వారా సరికొత్త మార్పును తెస్తుంది. ఈ కార్యక్రమం ఇప్పటికే హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, విశాఖపట్నం, జ్ఞానపురం, దుర్గాపురం, ఆరిలోవ, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో శక్తివంతమైన అవగాహన వర్క్‌షాప్‌లను నిర్వహించటంతో పాటుగా ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లను పంపిణీ చేసింది.

గుండె శ్రస్త చికిత్సకు సీఎం సహానిధి అందజేత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గుండె శస్త్ర చికిత్సకు సీఎం సహానిధిని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ బాధితులకు అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పిళ్ళా దుర్గారావుకు గుండె శ్రస్త చికిత్సకు సీఎం సహాయనిధి నుంచి రూ.2.5లక్షల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ మరుపిళ్ళ రాజేష్ పాల్గొన్నారు.

మురళీకృష్ణకు సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వరల్డ్ కేన్సర్ డే పురస్కరించి డాక్టర్ బీఆర్‌టీయస్ బీఆర్‌టీయస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రి మల్టీపుల్ హాస్పటల్ డాక్టర్ సిహెచ్. మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యులు పోళవరపు రాజారావు, కే.సత్యనారాయణ, బత్తిన సీతారామయ్య, అనంతరం కేన్సర్ బాధితులు పండ్లు పంపిణీ చేశారు.

విజయవాడ రత్న మరుపిళ్ల చిట్టి

కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ కేశినేని నాని

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): భారతరత్న మాదిరిగా విజయవాడ రత్న సర్దార్ మరుపిళ్ళ చిట్టి అని ఎంపీ కేశినేని నాని అన్నారు. కుల ప్రాంతీయ లకు అతీతంగా రాజ్యాంగ పరిరక్షణతో 1952లో ఎమ్మెల్యేగా ఎన్నికై అవిరళ కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ నగరాల ఐక్యవేదిక, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో చిట్టినగర్ సెంటర్ వద్ద ఏపీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబ్జి, పోతిన వెంకటస్వామి వీరిద్దరి అధ్యక్షతన మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహావిష్కరణ సభా కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా ఎంపీ కేసినేని శ్రీనివాసరావు(నాని), పశ్చిమ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ వైయస్సార్సీపి పశ్చిమ ఇంచార్జ్ ఎండి ఆసిఫ్, బిజెపి నాయకులు అడ్డురి శ్రీరామ్, భోగవల్లి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ, పోరాటంలో కుటుంబాన్ని సైతం ఉద్యమ బాట నిలిపిన వాళ్లలో ఒకరని కొనియాడారు. నగరాల కులంలో ఆరాధ్య దైవంగా భావించే పెద్దలూ, మాజీ ఎమ్మెల్యే , ఆంధ్రజ్యోతి బిరుదు అందుకున్న, స్వాతంత్ర సమరయోధులు, విజయవాడ ప్రజల కోసం మిల్క్ ఫ్యాక్టరీ కొరకు భూమి నీ దానం చేసిన మహనీయులు, సర్దార్. మరుపిళ్ళ చిట్టి అని కొనియాడారు. విగ్రహం అవిష్కరణ అనంతరం జనసేన వర్సెస్ వైయస్సార్సీపి ఆదర్శ ఆధిపత్యంతో సభా ప్రాంగణమంతా బాణాసంచా జగన్ పవన్ నినాదాలతో అద్యంతం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోతిన స్వామి, పోతిన పైడి రావు, పోతిన వెంకటేశ్వర స్వామి, బాయన వెంకట్రావు, చిట్టి పెద్ద కుమార్తె మరుపిళ్ల ఉమా మోహన తిలక్, నాగ పావని, పిళ్ళా మోహన్ రావు, వైవి రావు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రెల్లి కులస్తులకు గతంలో సఫాయి కర్మ చారి పథకం కింద స్వయం ఉపాధి రుణాలు ఇతర రుణాలు, పథకాలు అమలు చేసేవారని అయితే వైసిపి ప్రభుత్వం హాయంలో వాటిని విలిపివేశారని రానున్న ప్రభుత్వం అయినా వాటిని కొనసాగించే విధంగా తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని రాష్ట్ర రెల్లి పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ(జెఎసి) రాష్ట్ర కన్వీనర్ భూపతి అప్పారావు,ముఖ్య సలహాదారులు బొబ్బిలి లీలాకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జెఎసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెల్లి కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి అన్ని పార్టీలు రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీ,పార్లమెంట్ సీట్లు కేటాయించాలన్నారు.వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సఫాయి కర్మ చారి పథకం కింద కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిలిపివేసిందన్నారు.దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని మండిపడ్డారు. సఫాయి కర్మ చారి పథకం కింద రెల్లి కులస్తులకు స్వయం ఉపాధి రుణాలు ఇతర రుణాలు, పథకాలు అమలు చేసేవారన్నారు. రాష్ట్రస్థాయి సఫాయి కర్మ చారి కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు.పూర్తిస్థాయి ప్రతిపత్తితో రెల్లి గ్రూపు కులాల ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే ప్రభుత్వం అన్ని నామినేటెడ్ సభ్యులు మరియు డైరెక్టర్లలో రెల్లి ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మీడియా కో-అర్డినేటర్ మాడగుల లక్ష్మణ్,అల్లం సింహచలం. డిఎ.రాజు, బి.గోపికృష్ణ, వై.ప్రసాద్,వడ్డావి వెంకటేశ్వరరావు,డి.చంద్రమోహన్,తదితరులు పాల్గొన్నారు. డి.చంద్రమోహన్,తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విద్యార్థులు సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని వక్తలు సూచించారు. విస్సన్నపేట కోపా(కాపు అఫీషియల్స్ ఎయిడ్ ఫర్ పూర్), గుంటూరుకు చెందిన కృష్ణదేవరాయ పేద బలహీనవర్గాల సహాయనిధి ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వికాస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక దృక్పదం కలిగిన విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. సానుకూల దృక్పదంతో అపజయాల నుంచి విజయాల దిశగా పయనించాలన్నారు. విద్యాభివృద్ధి ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలు సాధించేందుకు ఆస్కారం ఉందని గుర్తించాలన్నారు. కోపా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.బండి గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు, ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్, జెన్‌కో రిటైర్డ్ డీఈఈ చందన రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం కోపా సభ్యులు వీరిని ఘనంగా సన్మానించారు. కోపా కార్యదర్శి ఎరుబండి వెంకట కృష్ణారావు, కోశాధికారి తుంగల సరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి నిమ్మల గాంధీ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300మంది విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు.

సిద్ధం అంటూ పోటాపోటీ ఫ్లెక్సీలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో సిద్ధం అంటూ వైసీపీ, జనసేన పార్టీలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. తొలుత శుక్రవారం రాత్రి వైసీపీ నేతలు స్థానిక మండలపరిషత్తు కార్యాలయం వద్ద సీఎం జగన్‌తో కూడిన సిద్ధం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ పక్కనే జనసేన నాయకులు శనివారం రాత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం సంసిద్ధం అంటూ పవన్‌కల్యాణ్, చంద్రబాబు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

మతాలు వేరైనా మానవులంతా ఒక్కటే...

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని, అందరూ సహోదర ప్రేమతో జీవించాలని ఏలూరు మేత్రాసనం ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదల (లూరు) మాత శతాబ్ది మహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన ఐదవరోజు నవదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొండపై భక్తులకు సందేశమిస్తూ కన్య మరియ పవిత్రాత్మ ద్వారా గర్భందాల్చి ప్రభువుకు జన్మనిచ్చిందని తెలిపారు. స్త్రీలందరిలో మరియతల్లి ఆశీర్వదించ బడినదని తెలిపారు. కారుణ్యమాతగా మరియమాత భక్తులచేత కీర్తించబడుతుందని భక్తులకు వివరించారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడుతూ 100 వసంతాల మహెూత్సవాలు జరుపుకోవటానికి ఇంకా నాలుగు రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో ఇప్పటి నుంచే ఉత్సవాలకు నవదిన ప్రార్థనల ద్వారా భక్తులను సంసిద్ధులను చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు శతాబ్ది మహెూత్సవాలు నిర్వహించటానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు. 5వ రోజు నవదిన ప్రార్థనలు ఆదివారం కావటంతో వివిధ ప్రాంతాలనుండి భక్తులు వెల్లువలా తరలివచ్చి గుణదలమాతను దర్శించుకున్నారు. అంతకుముందు ముఖ్యఅతిథి ఫాదర్ తోట గాబ్రియేలు, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి జయరాజు స్వామి, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు తదితర గురువులు "దివ్య సత్ప్రసాద మందసంతో" భక్తుల నడుమ ప్రదర్శనగా కొండపైకి చేరుకున్నారు. అనంతరం గురువులు ఐదవ రోజు "సమిష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. ఈ నవదిన ప్రార్థనలకు నున్న, అజిత్సింగ్నగర్, పాయకాపురం, తదితర విచారణల నుండి భక్తులు నిరుపేదలు, అనాధల గురించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డస్క్ సొసైటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ జాన్ పీటర్, పుణ్యక్షేత్రం సహాయ గురువులు కె. సునీల్ బాబు, బి. రవికుమార్, కె. ప్రతాప్, కన్యాస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై రూ.25.60 కోట్ల తో వంతెన నిర్మాణానికి విజయవాడ ఎంపీ కేశినేని .శ్రీనివాస్ (నానీ) ఆదివారం శంకుస్థాపన చేశారు. తిరువూరు నియోజకవర్గ ఇన్ చార్జ్ నల్లగట్ల స్వామి దాస్, జడ్పిటిసి కోట.సిమ్యూల్, ఎంపీపీ గోగులమూడి. శ్రీలక్ష్మి ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరుకు. నరసారెడ్డి, గోగులముడి. చెన్నకేశవరెడ్డి, కావూరి. వినయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్ రంగా విగ్రహం ఆవిష్కరించిన వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ న్యూ రాజీవ్ నగర్ కట్టా ప్రాంతంలో వంగవీటి మోహన్‌రంగా కాంస్యవిగ్రహంను మాజీ మంత్రి, ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. వడ్డేపల్లి సామ్రాజ్యం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు మోదుగుల గణేష్, యర్రగోర్ల శ్రీరాములు, తాడి శంకుతల, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట భవన నిర్మాణ కార్మికసంఘం ఎన్నికను సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షునిగా మర్రిబోయిన అప్పారావు, కార్యదర్శిగా పోతురాజు శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పోతురాజు సత్యనారాయణ, ఆకుల శోభన్‌బాబు, సహాయ కార్యదర్శిగా బి.శివ సుబ్బారావు, కోశాధికారిగా ఎం.మంగపతిరావు, గౌరవాధ్యక్షులుగా గంజినబోయిన రాము, గంధం సుబ్బారావు, ఆకుల శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావులను, రాజేష్, మురళీకృష్ణలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సిఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు ఈ ఎన్నికలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా వృకాసం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, కేవీపీఎస్ నాయకుడు ఎం.జ్ఞానరత్నం హాజరయ్యారు.

జగన్‌తోనే రాష్ట్ర అభ్యున్నతి : ఆసిఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్ర అభ్యున్నతి సాధ్యమని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్‌గారు అన్నారు. ఆదివారం మాడపాటి క్లబ్‌లో పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని అద్భుత కార్యక్రమాలు ఇక్కడ అమలవుతున్నాయన్నారు. మహిళా సాధికారతలో దేశంలోనే ముందు వరుసలో ఉన్నామన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయన్నారు. జగన్ పాలనను ప్రతి ఒక్క ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యుడేనని, వారందరికి తాను అండగా ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేయటానికి తమందరం కలిసి పని చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, చైతన్యరెడ్డి, అర్షద్, పూర్ణచంద్రరావు, ఆంజనేయ రెడ్డి, రెహమతున్నీసా, మైలవరపు రత్నకుమారి, బుల్లా విజయ్‌కుమార్, అత్తులూరి పెదబాబు, మహాదేవ్ అప్పాజీరావు, యలకల చలపతిరావు, తదితరు నేతలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MOHAMMED TANVEER (Old name) S/o. Nurul Amin Ruknuddin,** resident of D.No.18-8-30-202, 'G'-Towers, 5th Line, Opp. Masjid Gowsia, Kedareswara peta, Vijayawada, NTR District, Andhra Pradesh, India., have changed my name as **MOHAMMED TANVEER RUKNUDDIN (New name)** S/o. Nurul Amin Ruknuddin. Hereafter my name is known as **MOHAMMED TANVEER RUKNUDDIN** for all purposes.